# మా పార్టీ చరిత్రలో అనుభవాలు

## సెప్టెంబరు 25, 1956 - లాటిన్ అమెరికా దేశాల కమ్యూనిస్టు పార్టీలకు చెందిన కొందరు ప్రతినిధులతో జరిపిన సంభాషణలోని కొంత భాగం

**కా॥ మావో**

*ఈ వ్యాసంలో మావో చైనా విప్లవానుభవాలను వివరిస్తూ వర్గ దృక్పథం నుంచి గ్రామీణ ప్రాంతాల అధ్యయనం యొక్క అవసరాన్ని వివరించారు. సాధారణ పరిశీలన, నిర్దిష్ట పరిశీలన రెండూ అవసరమేనని చెప్పారు. నిర్దిష్ట పరిశీలనను సాధారణ పరిశీలనతో జోడించాలని వివరించారు. పై నుంచీ చూస్తే అంతా సమతలంగా వున్నట్లు కనిపించినా సమాజం అన్నది వివిధ వర్గాల, వాటి చలనాల రూపమని, వీటి అధ్యయనం అవసరాన్ని చెప్పినది ఈ వ్యాసం. లాటిన్ అమెరికా దేశాల కమ్యూనిస్టు పార్టీలకు చెందిన కొందరు ప్రతినిధులతో జరిపిన సంభాషణలోని కొంత భాగానికి వ్యాసరూపమిది. ప్రస్తుత పరిస్థితులలో ఉపయోగకరంగా వుంటుందని దీనిని పాఠకులకు అందిస్తున్నాం. – సంపాదకుడు.*



**అమెరికన్** సామ్రాజ్యవాదం మీకు, మాకు ప్రపంచ ప్రజలకు కూడా విరోధి. మీ వ్యవహారాలల్లో జోక్యం చేసుకోవడంకంటే మా వ్యవహారాలల్లో కలిగించుకోవటం అమెరికా సామ్రాజ్యవాదానికి కష్టం. అమెరికా మాకు చాలా దూరంలో వుండడం ఒక కారణం కాని అమెరికా సామ్రాజ్యవాదం మా తైవాన్‌కు, జపాన్, దక్షిణ కొరియా, దక్షిణ వియత్నాం, ఫిలిప్పైన్స్ వగైరాలకు చాలా దూరాలకు పాకింది. అమెరికా తన సైన్యాలను బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, ఐస్‌లాండ్, పశ్చిమ జర్మనీలలో నిలిపింది. అలాగే ఉత్తర ఆఫ్రికాలోనూ మధ్య, సమీప ప్రాచ్యా (తూర్పు దేశాలు)ల్లోనూ సైనిక స్థావరాలు నెలకొల్పింది. అది ప్రపంచంలో అన్ని మూలలకు పాకింది. అది ఒక ప్రపంచ పరివ్యాప్తమైన సామ్రాజ్యవాదం. అది సకల దేశాల ప్రజలకు నెగిటివ్ ఉదాహరణగా వుండే వుపాధ్యాయుడు. ప్రపంచ ప్రజలు సమైక్యమై అమెరికా సామ్రాజ్యవాదపు విషపు కోరలను అది విస్తరించిన ప్రతిచోట పెరికివేయడానికి పరస్పరం సహాయ పడాలి. ఒక్కొక్క విషపు కోర పీకేసినప్పుడల్లా మనకు మరింత వెసులుబాటు కలుగుతూ వుంటుంది.

గతంలో చైనా కూడా సామ్రాజ్యవాదమూ భూస్వామ్య విధానాలచే అణచివేయబడిన దేశమే. కనుక మా పరిస్థితులకు మీకు చాలా పోలిక వుంది. చాలా పెద్ద గ్రామీణ జనాభా, భూస్వామ్య శక్తులు వుండడం ఏ దేశానికైనా పెద్ద గుదిబండలే. కాని కార్మికవర్గం నడిపే విప్లవానికి అవే పెద్ద నిధులు. ఎందుకంటే అవి మనకు విశాల రైతాంగాన్ని మిత్రుడుగా అమర్చి పెడుతాయి. అక్టోబరు విప్లవానికి ముందర రష్యాలో భూస్వామ్య విధానం బలంగా వుండింది. రైతాంగ ప్రజారాశుల మద్దతుతోనే బోల్షివిక్‌పార్టీ విప్లవంలో విజయం సాధించింది. చైనా విషయంలో ఇది మరింత వాస్తవం. 50 కోట్లకు పైగా ప్రజలు గ్రామాలలోనే నివశిస్తున్న మా దేశం ఒక వ్యవసాయిక దేశం. గతంలో పోరాటంలో మేము ప్రధానంగా రైతాంగంపై ఆధారపడ్డాం. ఇప్పుడు కూడ రైతులు సంఘటితపడి, వ్యవసాయంలో కో ఆపరేటివ్ పద్ధతి వచ్చింది. కనుకనే మా పట్టణ బూర్జువాజీ త్వరగా సోషలిస్టు రూపాంతరీకరణకు లొంగివచ్చారు. అందువల్ల రైతాంగంలో పార్టీ కృషికి ప్రాణ సమానమైన ప్రాముఖ్యత వుంది.

భూస్వామ్య విధానం చాలా బలంగా వున్న దేశాలలో కార్మికవర్గ రాజకీయపార్టీ పల్లెసీమలకు పోయి రైతాంగాన్ని కదిలించడానికి ప్రయత్నించాలని నేను అనుకుంటున్నాను. రైతులను కదిలించడానికి మేధావులు గ్రామసీమలకు వెళ్ళినపుడు వారికి సరియైన దృక్పథం వుంటే తప్ప వారు రైతుల విశ్వాసాన్ని పొందలేరు. నగరాల మేధావులకు పల్లెపట్టు వ్యవహారాలు ఏమీ తెలియవు. వారు రైతు సమస్యలను ఎన్నటికీ సవ్యమైన పద్ధతిలో పరిష్కరించలేరు. మా అనుభవం ప్రకారం చాలా కాలం తర్వాత మాత్రమే. మనం వారి మంచికోసం, వారి ప్రయోజనాల కోసమే పోరాడుతున్నామని రైతులను ఒప్పించి మనం కూడా నిజంగా రైతులలో ఒకరుగా కలిసిపోయిన తరువాత మాత్రమే మనం విజయం సాధించగలం. రైతులు మనల్ని మొట్టమొదటే పోయిపోగానే నమ్ముతారని అనుకోవద్దు. మనం వారికి ఏదో

ఒక సహాయం చేసినంత మాత్రానే వారు వెనువెంటనే మనల్ని నమ్మాలని ఆశించవద్దు.

రైతులు కార్మికవర్గానికి ప్రధానమైన మిత్రులు. ప్రారంభంలో మా పార్టీ కూడా రైతులలో పనిచేయడానికి గల ప్రాధాన్యతను గుర్తించలేదు. పట్టణాలలో పనికి మొదటి స్థానం, గ్రామాలలో పనికి రెండవస్థానం ఇచ్చింది. ఇండియా, ఇండోనేషియా వంటి కొన్ని ఆసియా దేశాలలోని పార్టీలు గ్రామసీమలలో అంత బాగా పనిచేయటం లేదని నాకనిపిస్తోంది.

మొట్టమొదట్లో మా పార్టీ రైతులలో పని చేయటంలో విజయవంతం కాలేదు. మేధావులలో ఒక విధమైన మేధావివర్గపు అహంకారం, గర్వం వుండేవి. అందువల్లనే వారికి పల్లెసీమలపై చిన్నచూపు. గ్రామాలకు పోవడానికి వారు ఇష్టపడేవారు కాదు. ఇక రైతులు మేధావులను అనుమానంగా చూసేవారు. అప్పటికింకా మా పార్టీ గ్రామసీమలను అర్థం చేసుకొనే దారి పట్టలేదు. ఆ తరువాత మళ్ళీ మేము అక్కడికి వెళ్ళినప్పుడు ఆ దారి కనుగొన్నాం. గ్రామసీమల్లో వివిధ వర్గాలను విశ్లేషించి రైతుల విప్లవకర కోరికలను అవగాహన చేసుకోగల్గాం.

మొదటిదశలో మాకు పల్లెసీమల గురించి స్పష్టమైన అభిప్రాయాలు లేవు. చెన్ టూ-షి మితవాద, అవకాశవాద పంథా కింద, మా ప్రధాన మిత్రులైన రైతుల్ని పూర్తిగా వదిలివేశాం. మా కామ్రేడ్స్ చాలామంది గ్రామసీమలను లోతుపాతులతోకూడిన ఒక ఘనాకారంలాగాకాక కేవలం కళ్ళముందు పరచుకొన్న ఒక సమతలం లాగా చూశారు. అంటే వర్గ దృక్పథం నుంచి గ్రామసీమలను ఎలా చూడాలో వారికి తెలియదు. మార్క్సిజం కొంత పట్టుబడిన తరవాత మాత్రమే వారు గ్రామసీమల్ని చూడడంలో వర్గ దృక్పథం అవలంబించారు. గ్రామ ప్రాంతాలు కేవలం సాదాసీదాగా వుండే సమతలంగాకాక ధనికులు, పేదవాళ్ళు, కటిక దరిద్రులు అంటూ విభజింపబడి వుంది అని తేలింది. వ్యవసాయ కూలీలు, పేద రైతులు, మధ్యతరగతి రైతులు, ధనిక రైతులు, భూస్వాములు అనే భాగాలుగా గ్రామసీమ విభజింపబడింది అని తేలింది. ఈ దశలో నేను గ్రామాలను అధ్యయనం చేసి, రైతు వుద్యమం పాఠశాలలు తెరిచాను. అవి చాలాకాలం నడిచాయి. నాకు మార్క్సిజం ఏదో కొంత తెలిసినప్పటికీ గ్రామసీమలను గురించిన అవగాహన అంత లోతైనదికాదు.

ఇక రెండవ దశకు వస్తే మాకు పాఠం నేర్పిన చియాంగ్ కై - షేక్‌కు ధన్యవాదాలు చెప్పాలి. అతడు మమ్మల్ని గ్రామాలకు తరిమాడు. ఇది చాలా దీర్ఘకాలం, పదేళ్ళపాటు సాగిన అంతర్యుద్ధం. చియాంగ్ కై - షేక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆ కాలంలో మేము తప్పనిసరిగా గ్రామసీమలను అధ్యయనం చేయవలసి వచ్చింది. మొదట కొద్ది సంవత్సరాలలో గ్రామసీమల గురించి మా అవగాహన అంత లోతుగా లేదు. కానీ ఆ తర్వాత అది మెరుగై లోతుగా పెంపొందింది. ఈ దశలో వరుసగా చూ చూ-పాయ్, లీ లీ-సాన్ వాంగ్ మింగ్‌ల "అతివాద" అవకాశవాద పంథాలు తల ఎత్తి మా పార్టీకి గొప్ప నష్టాలు తెచ్చిపెట్టాయి. మరీ ముఖ్యంగా వాంగ్ మింగ్ "అతివాద" అవకాశవాద పంథా మూలంగా మా పార్టీ యొక్క గ్రామీణ స్థావర ప్రాంతాలు కూలిపోయాయి.

ఆ తరువాత మూడవ దశ వచ్చింది, అంటే, జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధ దశ వచ్చింది. జపాన్ సామ్రాజ్యవాదులు చైనాను ముట్టడించడంతో మేము కొమింగ్‌టాంగ్‌కు వ్యతిరేకంగా పోరాటం ఆపి దానికి మారుగా జపాన్ సామ్రాజ్యవాదంతో పోరాడాం. ఆ సమయంలో మా కామ్రేడ్స్ కొమింగ్‌టాంగ్ ప్రాంతాల్లోని నగరాలకు బహిరంగంగా వెళ్ళగలిగేవారు. గతంలో "అతివాద" అవకాశవాద పంథాను ముందుకు తెచ్చే తప్పుకు పాల్పడ్డాడు. అతడు మొదట కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క అతివాద వామపక్ష విధానాన్ని అమలుచేసి, ఈసారి అత్యంత మితవాద విధానాన్ని అనుసరించాడు. అతడు కూడా నెగిటివ్ వుదాహరణల ద్వారా మాకు పాఠాలు నేర్పిన మంచి ఉపాధ్యాయులలో ఒకడు. అతడు మా పార్టీకి విద్య గరిపాడు. మాకు లీ లీ-సాన్ మరొక చక్కటి నెగిటివ్ వుపాధ్యాయుడు. ఆనాడు వారి ప్రధానమైన తప్పు పిడివాదం, విదేశీ అనుభవాన్ని యాంత్రికంగా ఇక్కడ దిగుమతి చేయడం. మా పార్టీ వాళ్ళ తప్పుడు పంథాను ధ్వంసంచేసి మార్క్సిజం, లెనినిజం విశ్వజనీన సత్యాన్ని చైనా యొక్క నిర్దిష్ట పరిస్థితులలో సమైక్యం చేయటానికి నిజమైన దారిని కనుగొంది. తత్ఫలితంగా, నాల్గవ దశలో, చియాంగ్ కై-షేక్ మాకు వ్యతిరేకంగా ఎదురుదాడి ప్రారంభించినప్పుడు అతనిని కూలద్రోసి చైనా ప్రజా రిపబ్లిక్‌ను స్థాపించడం మాకు సాధ్యమయింది.

గ్రామీణ స్థావర ప్రాంతాలను నిర్మించటం, గ్రామ ప్రాంతాల నుండి నగరాలను చుట్టుముట్టి చివరకు నగరాలను పట్టుకోవటం అనే చైనా విప్లవపు అనుభవం మీకు రిఫరెన్స్‌కు పనికి వచ్చినా, మీ, అనేక దేశాల్లో అది మొత్తంగా వర్తించక పోవచ్చు. చైనా అనుభవాన్ని యాంత్రికంగా దిగుమతి చేసుకోవద్దు అని నా సలహా. ఏ పరాయిదేశపు అనుభవమైనా ఒక దేశానికి రిఫరెన్సుగా వుపయోగపడవచ్చుగాని అంత మాత్రం చేత దానినే పిడివాదంగా మాత్రం పరిగణించకూడదు. మార్క్సిజం, లెనినిజం విశ్వజనీన సత్యమూ, మీ స్వంతదేశాల నిర్దిష్ట పరిస్థితులూ - ఈ రెండింటినీ తప్పనిసరిగా మేళవించి సమైక్యం చేయాలి.

మీరు రైతులను మీవైపు తిప్పుకొని వారిపై ఆధారపడాలంటే తప్పనిసరిగా మీరు గ్రామీణ ప్రాంతాలలో పరిశోధనలు జరపాలి. గ్రామీణ ప్రాంతాల్లో వర్గశక్తులు, ఆర్థిక పరిస్థితీ, జీవన పరిస్థితులూ మొదలైనవాటి గురించి స్పష్టమైన అవగాహన కలగాలంటే ఒకటో రెండో మరిన్ని ఎక్కువో గ్రామాలను తీసుకొని పరిశోధన చేయటం, అక్కడ కొన్ని వారాలు గడపడం, అదే సరైన పద్ధతి. పార్టీ జనరల్ సెక్రటరీ వంటి ముఖ్యమైన నాయకులు స్వయంగా ఈ పనిని తీసుకొని ఒకటి రెండు గ్రామాలను గురించి తెలుసుకోవాలి. ఈ పని చేయటానికి వారు తప్పనిసరిగా ప్రయత్నించి సమయం కేటాయించు కోవాలి. ఇది అంత శ్రమించదగిన ప్రాధాన్యత గల పని. అనేక పిచ్చుకలు వుండవచ్చు. ప్రతి ఒక్కదాన్ని కోసి చూడాల్సిన పనిలేదు. ఒకటో రెండో చూస్తే

చాలు. పార్టీ జనరల్ సెక్రటరీ ఒకటి రెండు గ్రామాలను పరిశోధించి ఏది ఏమిటో బాగా తెలుసుకుంటే, అతడు, తన కామ్రేడ్సు గ్రామాలతో పరిచయం పెంచుకొని అక్కడ నిర్దిష్ట పరిస్థితులను గురించి స్పష్టమైన అవగాహన పెంచుకోవడానికి వారికి బాగా తోడ్పడతాడు. అనేక దేశాలలో పార్టీ జనరల్ సెక్రటరీలు ఒకటి రెండు పిచ్చుకల్ని స్వయంగా కోసి చూసే పనికి ప్రాధాన్యం ఇవ్వటం లేదని నాకనిపిస్తోంది. వారికి గ్రామసీమలను గురించి ఎంతో కొంత తెలుసుననేది నిజమే కాని, వారి జ్ఞానం లోతైనది కాకపోవడం వల్ల వారిచ్చే ఆదేశాలు గ్రామ ప్రాంతాల పరిస్థితులకు సరిగా అతకటంలేదు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర, కౌంటీ స్థాయిలలో పార్టీ నాయకత్వ సంస్థలను నడిపే కామ్రేడ్స్ కూడా ఒకటి రెండు పిచ్చుకలను కోసి చూడడం లేదా ఒకటి రెండు గ్రామాలు స్వయంగా పరిశీలన జరపటం చేయాలి. దీనినే ఎనాటమీ (శారీరక శాస్త్రం) అంటారు.

పరిశోధన జరపటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి, గుర్రం మీద కూర్చుని పూవులను పరిశీలించడం (విహంగ దృష్టితో చూడడం) ఇంకొకటి, నేలమీదకు దిగి దగ్గరగా పరిశీలించడం. మీరు గుర్రంమీదనే కూర్చుని చూచినట్లయితే, అక్కడ చాలా పూవులు వుంటాయి కనక, మీరు కేవలం పై పై చూపులకు కనిపించే అభిప్రాయాన్ని మాత్రమే తెలుసుకోగలరు. లాటిన్ అమెరికా నుండి ఆసియాకు రావటంలో మీరు గుర్రంమీద కూర్చుని పూవుల్ని చూచినట్లే తెలిసికొంటారు. మీ సొంత దేశాల్లో అనేక పూవులున్నాయి. కేవలం వాటిపై ఒకసారో రెండుసార్లో చూపు ప్రసరించి వదిలేస్తే సరిపోదు. కనక రెండవ పద్ధతినే ఉపయోగించాలి. అంటే కిందికి దిగి దగ్గరగా పరిశీలించాలి. “ఒక పూవును” విశ్లేషించడం లేదా “ఒక పిచ్చుకను” కోసి చూడటం చేయాలి.

సామ్రాజ్యవాదం చేత అణిచివేయబడుతున్న దేశాలలో రెండు రకాల బూర్జువాలు – జాతీయ బూర్జువావర్గం, దళారీ బూర్జువా వర్గం వున్నారు. మీ దేశాలలో కూడా ఈ రెండు రకాల బూర్జువా వర్గం వుందా? బహుశా వుండే వుంటుంది.

దళారీ బూర్జువావర్గం ఎప్పుడైనా సామ్రాజ్యవాదపు కావలికుక్కే. అది విప్లవంలో పడగొట్టవలసిన లక్ష్యం (టార్గెట్). దళారీ బూర్జువా వర్గంలోని వేరువేరు ముఠాలు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి సామ్రాజ్యవాద దేశాల గుత్త పెట్టుబడిదారులకు చెంది వుంటాయి. వివిధ దళారీ గ్రూపులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య వుండే వైరుధ్యాన్ని వాడుకోవడం. అంటే మొదట వాటిలో ఒకదానితో సర్దుకుంటూ తక్షణ ముఖ్య శత్రువుపై దెబ్బతీయటం అవసరం. ఉదాహరణకు, గతంలో చైనాలోని దళారీ బూర్జువావర్గంలో బ్రిటీష్ అనుకూల, అమెరికా అనుకూల, జపాన్ అనుకూల గ్రూపులు వుండేవి. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలో మేము ఒకవైపు బ్రిటన్ అమెరికాలకు ఇంకొకవైపు జపాన్‌కు మధ్య వుండే వైరుధ్యాన్ని వాడుకున్నాం. మొదట జపాన్ దురాక్రమణదారుల్నీ వారిపై ఆధారపడిన దళారీ గ్రూపును దెబ్బతీశాం. ఆ తరువాత అమెరికా బ్రిటీష్ దురాక్రమణదారుల్ని దెబ్బతీయడానికి అమెరికా అనుకూల బ్రిటీష్ అనుకూల దళారీ గ్రూపులను దించివేయడానికి ఇటు తిరిగాం. భూస్వామ్య వర్గంలో కూడా వివిధ ముఠాలు వుంటాయి. అత్యంత అభివృద్ధి నిరోధకులైన భూస్వాములు సంఖ్యరీత్యా కొద్దిమందే వుంటారు. మనం దెబ్బతీసేటపుడు, దేశభక్తి కలిగి సామ్రాజ్యవాదంపై పోరాడటానికి సుముఖంగా వుండే భూస్వాములను కూడా పైవారితో కలిపి ఒకే గాటన కట్టకూడదు. అంతేగాక, బడా భూస్వాములకు, చిన్న భూస్వాములకు మధ్య కూడా తేడా చూడాలి. ఒకేసారి అనేకమంది శత్రువులపై దెబ్బతీయటానికి పూనుకోరాదు. ఒకసారి కొద్దిమందిపైనే దెబ్బతీయాలి. బడా భూస్వాములతో వ్యవహరించేటపుడు కూడా అత్యంత అభివృద్ధి నిరోధకులైన కొద్దిమంది మీదనే మన దెబ్బ పడాలి. ప్రతి ఒక్కడినీ దెబ్బతీయాలనడం చాలా విప్లవకరంగానే కనిపించవచ్చుగాని, వాస్తవంలో అది చాలా హాని చేస్తుంది.

జాతీయ బూర్జువాజీ మనకొక ప్రత్యర్థి. “శత్రువులు ఎప్పుడూ కట్టుకడతారు” అని ఒక చైనా సామెత. చైనా విప్లవంలో ఒక అనుభవం ఏమంటే, జాతీయ బూర్జువావర్గంతో వ్యవహరించడంలో చాలా జాగ్రత్త వుండాలి. అది కార్మిక వర్గానికి వ్యతిరేకం కాగా, అటు సామ్రాజ్యవాదానికి కూడా వ్యతిరేకే. సామ్రాజ్యవాదంతోనూ, భూస్వామ్య విధానంతోను పోరాడడం మన ముఖ్య కర్తవ్యమనేది, ఈ ఇద్దరి శత్రువులను కూలదోయనిదే ప్రజలకు విముక్తి లేదనే వాస్తవమూ దృష్టిలో వుంచుకొంటే మనం ఎలాగైనాసరే జాతీయ బూర్జువావర్గాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలోకి రాబట్టగలగాలి. భూస్వాముల వర్గంతో చాలా సన్నిహిత సంబంధాలు కలిగి వుంటుంది. కనుక జాతీయ బూర్జువావర్గానికి భూస్వామ్య విధానంపై పోరాడాలనే ఆసక్తి వుండదు. అంతేగాక అది కార్మికవర్గాన్ని దోచుకొంటుంది కనుక మనం దానికి వ్యతిరేకంగా పోరాడాలి. కానీ, సామ్రాజ్యవాద పోరాటంలో దానిని మనవైపు త్రిప్పుకొని కలుపుకోవడానికి దానిపై పోరాటంలో ఎక్కడ ఆగాలో మనకు తెలుసుండాలి. అంటే, న్యాయమైన కారణాలపైన, మనకు లాభదాయకంగా ఉండే విధంగా నిగ్రహంతో పోరాటం చెయ్యాలి. ఇంకొక మాటల్లో చెప్పాలంటే పోరాటం చేయడానికి మన కారణాలు న్యాయమైనవిగా వుండాలి; మనం తప్పనిసరిగా గెలుస్తామని హామీ వుండాలి. తగినంత మేరకు విజయం పొందిన తరువాత నిగ్రహం చూపాలి. అందుకనే ఇరుపక్షాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశోధన చేయటం అవసరం. కార్మికుల పరిస్థితులను, పెట్టుబడిదారుల పరిస్థితిని కూడా తెలుసుకోవాలి. మన కార్మికులను మాత్రమే తెలుసుకొని, పెట్టుబడిదారులను తెలుసుకోకపోతే, మనం పెట్టుబడిదారులతో సంభాషణలు జరుపలేము. ఈ విషయంలో కొన్ని నమూనా కేసులను పరిశీలించటం కూడా అవసరం. ఒకటోరెండో “పిచ్చుకల”ను కోసి చూడటం అవసరం. గుర్రంమీద కూర్చుని పువ్వులను పరిశీలించడం (విహంగ దృష్టితో చూడడం), నేలను దిగి దగ్గరగా చూడటం అనే రెండు పద్ధతులు కూడా వుపయోగించాలి.

సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటం జరిపే చారిత్రిక దశ మొత్తం అంతటిలోనూ, మనం తప్పనిసరిగా జాతీయ బూర్జువావర్గాన్ని మనవైపు తిప్పుకొని అది సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలపక్షం వహించేటట్లు దానితో సమైక్యం కావాలి. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించే కర్తవ్యం ప్రధానంగా పూర్తి అయిపోయిన తరువాత కూడా, కొంతకాలం పాటు మనం తప్పనిసరిగా జాతీయ బూర్జువా వర్గంతో స్నేహం కొనసాగించాలి. సామ్రాజ్యవాద దురాక్రమణను ఎదుర్కోవడంలోనూ, ఉత్పత్తిని విస్తృతపర్చడంలోనూ మార్కెట్లును నిలకడగా వుంచడంలోనూ, బూర్జువా మేధావులను మనవైపు త్రిప్పుకొని వారిని మలచుకొనటంలోనూ కూడా అది మనకు లాభదాయకంగా వుపయోగ పడుతుంది.

మీరు ఇంకా రాజ్యాధికారాన్ని గెలుచుకోలేదు. అందుకు తయారవుతున్నారు. జాతీయ బూర్జువా వర్గంపట్ల "ఐక్యత–పోరాటం" రెండూ వుండే విధానాన్ని అవలంబించాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక వుమ్మడి పోరాటంలో వారితో కలవండి. వారి అభివృద్ధి నిరోధక, కార్మికవర్గ వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక మాటలకు, చేతలకు వ్యతిరేకంగా తగిన విధంగా పోరాడుతూనే, వారి సామ్రాజ్యవాద వ్యతిరేక మాటలను, చేతలను అన్నింటినీ, సమర్ధించండి. "ఏకపక్షంగా వ్యవహరించడం తప్పు". ఐక్యత లేకుండా అంతా పోరాటమే అయితే అది "అతివాద" పెడధోరణి తప్పుకాగా, పోరాటం లేకుండా సమైక్యత, మితవాద పెడధోరణి తప్పు అవుతుంది. మా పార్టీలో పై రెండు తప్పులూ జరిగాయి. వాటి నుండి మేము చేదు గుణపాఠాలు నేర్చుకున్నాం. ఆ తరువాత ఆ రెండు రకాల అనుభవాలను క్రోడీకరించుకొని అప్పటి నుండి మేము "ఐక్యత – పోరాటం" రెండూ వుండే విధానాన్ని అంటే అవసరమైనపుడు పోరాటం, వీలయినపుడు ఐక్యం కావటం అనే విధానాన్ని అవలంబిస్తున్నాం. మన పోరాటానికి లక్ష్యం జాతీయ బూర్జువాజీతో సమైక్యమై సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విజయం సాధించడమే.

సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానాలచే అణగద్రొక్కబడుతున్న దేశాలలో కార్మికవర్గ రాజకీయ పార్టీ తప్పనిసరిగా జాతీయ పతాకను ఎత్తిపట్టి, సామ్రాజ్యవాద బడి తొత్తులను మినహాయించి మిగిలిన కలుపుకోగల శక్తులన్నింటితో సమైక్యం కావడానికి అనువైన జాతీయ సమైక్యతా కార్యక్రమాన్ని ముందుకు తీసుకురావాలి. కమ్యూనిస్టు పార్టీ ఎంతటి దేశభక్తిగల పార్టీయో, అది ఎంత శాంతికాముక మైనదో, జాతీయ సమైక్యతను అది ఎంతగా కోరుకుంటుందో యావత్తు జాతిని అర్ధం చేసుకో నివ్వండి. సామ్రాజ్యవాదాన్ని, దాని బడితొత్తులను, బడా భూస్వాముల వర్గాన్నీ, బడా బూర్జువా వర్గాన్నీ కూడా ఏకాకులను చేయటానికి అది ఎంతగానో తోడ్పడుతుంది.

కమ్యూనిస్టులు తప్పులు చేయడానికి వెరవ కూడదు, తప్పులకు ద్వంద స్వభావం వుంటుంది. ఒకవంక తప్పులు పార్టీకీ ప్రజలకు హాని కలిగిస్తాయి. ఇంకొక వంక పార్టీకి, ప్రజలకు కూడా అవి చక్కని పాఠాలు నేర్పుతూ మంచి వుపాధ్యాయిలుగా వుపయోగపడి విప్లవానికి మేలు చేస్తాయి. ఓటమి విజయానికి తల్లివంటిది. ఓటమిలో మంచి అంటూ ఏమీ లేకపోతే అది విజయానికి తల్లి ఎలా కాగలుగుతుంది? చాలా తప్పులు జరిగినప్పుడు తప్పనిసరిగా తద్వ్యతిరేక ఫలితం వచ్చి తీరుతుంది. అది మార్క్సిజం "ఒక విషయం అతిగా పోయినప్పుడు అది దానికి వ్యతిరేక విషయంలోకి మారిపోతుంది; తప్పులు గుట్టపడినపుడు వెలుగు ఎంతో దూరంలో వుండదు."

**(క్రాంతి ప్రచురణలు – 'మావో రచనలు' – 5వ సంపుటి – 2వ భాగం నుండి)**

ooo